క్లుప్తంగా

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



పడమర ఖండ్రికలో బాలగణపతి చవితి ఉత్సవాల రాట ముహూర్త పూజ చేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలో సోమవారం వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్త పూజలు చేశారు. గ్రామంలోని బాలగణపతి చవితి ఉత్సవాల శిబిరం వద్ద నిర్వాహకులు గ్రామ ప్రజాపతినిధులు ముహూర్త పూజలను చేశారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

చురుగ్గా పద్మశాలీ కమ్యూనిటీ భవన నిర్మాణం



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పద్మశాలీ కమ్యూనిటీ భవనం శ్లాబ్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులను శ్రీభావన ఋషి పద్మశాలీ సేవాసంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. భవన నిర్మాణానికి అమలాపురం ఎంపీ చింతా అనూరాధ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తోడ్పాటుతో భవన నిర్మాణ పనలు సాగుతున్నాయి. పనులను సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, పద్మశాలీ సేవా సంఘం నాయకులు బండారు మహా లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.

హిందూ ఆధ్యాత్మిక చైతన్య మహాసభ



తిరుపతిలో జరిగిన హిందూ ధార్మిక సదస్సులో తాళ్ల సాంబశివరావు గురూజీ

రామచంద్రపురం రూరల్: ప్రముఖ శైవ క్షేత్రం ద్రాక్షారామలో త్వరలో హిందూ ఆధ్యాత్మిక చైతన్య మహాసభ నిర్వహించనున్నట్లు రాజరాజేశ్వరి పీఠాధిపతి, మాసశివరాత్రి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశ్రీ తాళ్ల సాంబశివరావు గురూజీ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తిరుపతిలో జరిగిన హిందూ ధార్మిక సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు వెయ్యి మంది స్వామీజీలతో పాటుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్వామీజీలను ద్రాక్షారామకు ఆహ్వానించగా వారు అంగీకరించారని తెలిపారు.

30 వరకు 144 సెక్షన్ అమలు



టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ

రామచంద్రపురం రూరల్: డివిజన్ పరిధిలో ఈ నెల 30 వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడకూడదని, ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేపట్టకూడదని, ఎక్కడా రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు చేయకూడదని, సోషల్ మీడియా ద్వారా వివాదాలు చెలరేగేలా పోస్టింగులు పెట్టకూడదని తెలిపారు. ఆ విధంగా ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన డీవైఈఓను కలసిన పీఆర్‌టీయూ నేతలు



నూతన డీవైఈఓ లక్ష్మీ నరసింహను మర్యాద పూర్వకంగా కలసిన పీఆర్‌టీయూ నాయకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నూతన డీవైఈఓగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ నరసింహం(ఫణి)ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీఆర్‌టీయూ కార్యవర్గం సోమవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నరాల కృష్ణకుమార్, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి గోవిందరాజు, జిల్లా ప్రెసిడెంట్ తిలక్‌బాబు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.పాపాజీ, జిల్లా కార్యదర్శి డి.నందేశ్వరరావు, రామచంద్రపురం మండల ప్రెసిడెంట్ నాళం శ్రీను, జనరల్ సెక్రటరీ ఎం.అమృతరావు, హెచ్ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు అండగా ప్రభుత్వం

- సాధారణ రైతుల్లాగే వారికీ రైతు భరోసా
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు లబ్ధి
- రెండు నియోజకవర్గాల్లో 3,601 మందికి ప్రయోజనం

కపిలేశ్వరపురం: రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో సారి కౌలు రైతుకు సాయం అందించింది. సొంత భూమి లేని కౌలు రైతులకు మానవత్వంతో చేయూత ఇస్తోంది. సాధారణ రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున సాయం అందిస్తున్నట్టుగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు సాయం చేస్తూ సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసింది. ఈ నెల 1న వారి ఖాతాలకు సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు.

కౌలు రైతుకు రైతు భరోసా ఇలా...

సాధారణ రైతుకు సాయమందిస్తున్న తీరుగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసాను అమలు చేస్తోంది. సాధారణ రైతులకు అందజేస్తున్నట్టుగానే ఏడాదికి రూ.13,500 చొప్పున సాయం అందిస్తుంది. 2023–24 సీజన్‌కు సంబంధించి తొలి విడతగా 7,500 చొప్పున ఈనెల 1న ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేసింది. మిగిలిన రూ.5 వేల సాయాన్ని మలి విడతగా జనవరిలో జమ చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. జిల్లాలో 5,505 మందికి రూ.4,12,87,500 మేర లబ్ధి చేకూర్చింది.



టేకిలో కౌలు రైతుల అవగాహన సదస్సులో పథకాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట (ఫైల్)

కౌలు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం తోడు

సొంత భూమి లేకున్నా వ్యవసాయ భూమినే నమ్ముకుని జీవిస్తున్న కౌలు రైతు దీర్ఘకాలంగా కష్టనష్టాలను భరిస్తూ వస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన లబ్ధి అందక సతమతం అయ్యేవారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలు రైతుకు మేలు చేయాలన్న తపనతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. భూమిగల రైతు తమ భూ హక్కులు పోతాయన్న భావనతో కౌలు రైతుకు సాగు హక్కు ఇచ్చేందుకు అంగీకరించకపోవడం దీర్ఘకాలంగా జరుగుతుంది. ఈ సమస్య పరిష్కారానికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం 11 నెలల సాగు హక్కు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా భూమిగల రైతుకు చట్టపరమైన చిక్కులేమీ తలెత్తవు. స్వేచ్ఛగా కౌలు చేస్తున్న రైతుకు పంట సాగుదారు హక్కు పత్రాన్ని (సీసీఆర్సీ) ఇచ్చేందుకు సంసిద్ధమయ్యాడు. ప్రభుత్వ కృషి ఫలితంగా మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 3,601 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులు రైతు భరోసా సాయాన్ని పొందగలిగారు.

జగన్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం



ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాల రైతులు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందడం సాధారణంగా సాధ్యంకాదన్న భావనలో ఉండేవాళ్ళం. ఈ రోజు ఆయా సామాజిక వర్గాల కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. బడుగు బలహీనవర్గ సామాజికవర్గీయులు రైతు భరోసా సాయం మంజూరుకావడంతో సంతోషంగా ఉన్నారు.

పలివెల మధు, దళిత ఎంపీటీసీ సభ్యుడు, వడ్లమూరు

రెండు నియోజకవర్గాల్లో కౌలు రైతుభరోసా సాయం ఇలా...

మండలం	కౌలు రైతులు	చేకూరిన లబ్ధి(రూ.)
మండపేట	259	1942500
రాయవరం	972	7290000
కపిలేశ్వరపురం	465	3487500
రామచంద్రపురం	916	6870000
కె.గంగవరం	989	7417500
మొత్తం	3,601	2,70,07,500

పూర్తి ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్

కాజులూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడినట్టు పూర్తి ఆధారాలతోనే టీడీపీ నేత నారా చంద్రబాబునాయుడిపై సీఐడి పోలీసులు కేసులు నమోదు చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. సోమవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకు పోలీసులు అరెస్టు చేస్తే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వ్యక్తిని ఏదో రాజ్యాంగ విరుద్ధంగా అరెస్టు చేసినట్టు టీడీపీ, జనసేన నాయకులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంజేరు పీఏసీఎస్ చైర్మన్ గండి కిశోర్, పార్టీ నాయకులు దుబాయ్ శ్రీను, తోట కృష్ణ, వడ్డి శ్రీను, మాత నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటిస్తే అంటువ్యాధులు దూరం

కాజులూరు: ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తే మనిషి అంటువ్యాధులకు దూరంగా ఉండగలుగుతాడని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో జరిగిన ఆశా వలంటీర్లు, ఏఎన్ఎంల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా గ్రామాల్లో అపారిశుధ్య వాతావరణం ఏర్పడి అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేలా సిబ్బందిని చైతన్య పరచాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించేలా సూచించాలన్నారు.

కానరాని బంద్ ప్రభావం

రామచంద్రపురం: ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు రామచంద్రపురం నియోకవర్గంలో స్పందన కరువైంది. ఉదయం నుంచి స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బస్సులు యథావిధిగానే నడిచాయి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదు. ఉదయం కొంత మంది జనసేన కార్యకర్తలు స్థానిక బైపాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేసే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో వున్నందున జిల్లాలో ఎక్కడా నిరసనలకు, ధర్నాలకు, బంద్‌కు అనుమతి లేదని రామచంద్రపురం పోలీసులు ప్రకటనల ద్వారా తెలియజేశారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన మేరకు టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలో బస్సుల రవాణాకు ఆటంకాలు, నిరసనలకు, ధర్నాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సముదాయాలను బలవంతంగా మూయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: స్కిల్ స్కామ్ కేసులో రిమాండ్‌కు వెళ్లిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతుగా మండలంలో టీడీపీ నాయకులు నిర్వహించిన బంద్‌కు ప్రజల నుంచి మద్దతు కరువైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో యథావిధిగా దుకాణాలు, వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. పామర్రులో అనుమతి లేకుండా ర్యాలీ చేస్తున్న కొంత మంది టీడీపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చిన బంద్‌కు స్పందన మండలంలో నామమాత్రంగా ఉంది. బస్సులు, ఆటోలు రోడ్లపై యథేచ్ఛగా ప్రయాణించగా, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు యథావిధిగా తెరచుకున్నాయి. గొల్లపాలెం కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు జంక్షన్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయం సమీపాన దుకాణాలు తెరచుకుని వ్యాపారాలు కొనసాగాయి. అందోళనకారుల హెచ్చరికలతో మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, కాజులూరు, దుగ్గుదుర్రు, కుయ్యేరు గ్రామాల్లో బ్యాంకులు మూతపడ్డాయి. పోలీసులు ప్రధాన కూడళ్లలో గస్తీలు తిరుగుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మండపేటలో..

మండపేట: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అరెస్టు నేపథ్యంలో టీడీపీ తలపెట్టిన బంద్ మండపేటలో పాక్షికంగా జరిగింది. ఉదయం టీడీపీ, జనసేన నాయకులు హడావుడి చేసి షాపులు, కార్యాలయాలు మూసి వేయించగా మధ్యాహ్నం నుంచి యథావిధిగా తెరుచుకున్నాయి. బంద్ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సోమవారం ఉదయం ఆయన క్యాంపు కార్యాలయంలో పట్టణ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవు ప్రకటించగా ఉదయం ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు యథావిధిగా తెరుచుకున్నాయి. కాగా టీడీపీ, జనసేన పార్టీలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు షాపులు, కార్యాలయాలు, పాఠశాలలకు తిరిగి మూసి వేయించారు. మధ్యాహ్నం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, చాలా వరకు షాపులు తెరుచుకున్నాయి. పట్టణంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ శ్రీధర్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐలు ఎం అశోక్, కె అప్పారావు బందోబస్తు నిర్వహించారు. సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఎక్కడా జనం గుమిగూడకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలోని ఏడిద, ద్వారపూడి గ్రామాల్లోను బంద్ పాక్షికంగా జరిగింది.



గొల్లపాలెంలో టీడీపీ కార్యాలయం వద్ద యథావిధిగా తెరచుకున్న దుకాణాలు



మండపేటలో మున్సిపల్ కార్యాలయాన్ని మూసివేయిస్తున్న టీడీపీ నాయకులు

ద్రాక్షారామలో కనిపించని బంద్ ప్రభావం

రామచంద్రపురం రూరల్: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుతో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇచ్చిన బంద్ పిలుపునకు ద్రాక్షారామలో ఏ మాత్రం స్పందన కనిపించలేదు. ప్రతి సోమవారం ద్రాక్షారామలో వారపు సంత ఉంటుంది. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ద్రాక్షారామకు కొనుగోలు నిమిత్తం ప్రజలు వస్తారు. అందువల్ల ద్రాక్షారామ వ్యాపారస్తులు ఎవరూ కూడా షాపులు మూసేసి వ్యాపారం పోగొట్టుకోవడానికి సిద్ధపడలేదు. దీనితో ద్రాక్షారామలో యథావిధిగా వ్యాపార కార్యకలాపాలు సాగాయి. ముందుస్తుగా చెప్పడంతో ప్రైవేటు పాఠశాలలు మాత్రం మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. తెలుగుదేశం, జనసేన నాయకులు సానుభూతి క్రియేట్ చేయాలని ప్రయత్నిస్తున్నా వారి ప్రయత్నాలు వృథా అవుతున్నాయి. చేసిన తప్పుకు ఎప్పటికైనా శిక్ష తప్పదన్న భావననే ఎక్కువ మంది వ్యక్తపరుస్తున్నారు.



ద్రాక్షారామలో యథావిధిగా వ్యాపార కార్యకలాపాలు

సొసైటీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



పామర్రులో సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: మండలంలోని పామర్రులో సోమవారం నూతన సొసైటీ భవన నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న ఈ భవనానికి మంత్రి వేణు వేద పండితుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఇప్పటికే మండలంలో పలు చోట్ల శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనాలను తొలగించి ఆ స్థానంలో నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ వాసంశెట్టి గంగాభవాని, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సొసైటీ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కూర్మం ఆకారాన్ని తలపిస్తున్న చెట్టుపై అల్లుకున్న పాద

రాయవరం: ప్రకృతిని పరికిస్తే అన్నీ అందాలే కనిపిస్తాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా వర్షాలకు దొంకలన్నీ తీగలతో అల్లుకుని, పచ్చదనంతో కొత్త అందాలను సృష్టిస్తున్నాయి. మండలంలోని మాచవరం గ్రామం వద్ద కాకినాడ–మండపేట రహదారిపై అల్లుకున్న దొంక కూర్మాన్ని తలపిస్తోంది. తాబేలు ఆకారంతో అల్లుకున్న పాద ప్రయాణికులను అలరిస్తోంది.


మర్రిపూడికి రాని ఎత్తిపోతల నీరు

- 3,000 ఎకరాల శివారు ఆయకట్టుకు మొండిచేయి
- నీరందించాలనే విషయమే మరిచిపోయిన అధికారులు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలం మొత్తానికి సాగునీరు అందించడానికి రూ.80 కోట్లతో చాగల్నాడు ఎత్తిపోతల పథకం నిర్మించారు. పథకం ద్వారా ఏడాది కాలంగా మర్రిపూడి, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు తదితర శివారు గ్రామాలకు నీరందడం లేదు. ఆయా గ్రామాల్లో సుమారు 3,000 ఎకరాలకు పైగానే సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట కాలువ పూడ్చేయడం వల్లేనా..?

వడిశలేరు నుంచి పెదరాయవరం, వెంకటాపురం, దొడ్డిగుంట మీదుగా మర్రిపూడికి 21 కిలోమీటర్ల పొడవున పంట కాలువ నిర్మించారు. కొద్దికాలం పాటు సక్రమంగా నీరందించినా తరువాత శివారు గ్రామం కావడంతో నీటి సరఫరా జరగలేదు. ఎత్తిపోతల అధికారులు కూడా మర్రిపూడికి నీరందించాలనే విషయమే మర్చిపోయారు. ఈ ఏడాది జులై 15న చాగల్నాడు పథకం ద్వారా నీటిని విడుదల చేసినా ఇంతవరకూ వడిశలేరు, రంగంపేట గ్రామాలకు తప్ప మర్రిపూడితో సహా వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు తదితర శివారు గ్రామాలకు నీరు చేరలేదు. నీరు లేక సుమారు 3,000 ఎకరాలకు పైగానే పొలాలు బీళ్లు వారుతున్నాయి. దీనిపై ఆయకట్టు రైతులు ఎత్తిపోతల అధికారులను నిలదీశారు. పెదరాయవరం వద్ద ఓ రైతు తనకు నష్టపరిహారం అందక పంట కాలువను 15 మీటర్ల వెడల్పు, 450 మీటర్ల పొడవునా పూడ్చివేసినట్టు తమకు తెలిసిందని చెప్పి చేతులు దులిపేసుకున్నారే సమస్య పరిష్కారానికి చర్యలు కరవయ్యాయి. దీనికి తోడు ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రంగంపేట వద్ద కొంతమేర కాలువ వ్యవస్థను ధ్వంసం చేశారు. దీనివల్ల కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. చాగల్నాడు డీఈ ఆనందబాబు ఇటీవల వాహన ప్రమాదానికి గురికావడంతో పట్టించుకునేవారు కరవయ్యారు. చాగల్నాడు ఎత్తిపోతల సమస్యలు పరిష్కరించి వెంటనే మర్రిపూడి, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి తదితర గ్రామాలకు నీరందించాలని మండల సాగునీటి సాధన కమిటీ సభ్యులు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చాగల్నాడు ఎత్తిపోతల పథకం

మణిపూర్‌లో సహాయ కార్యక్రమాలు

కొత్తపేట: మణిపూర్‌లో దాడులకు గురైన ప్రాంతాల్లో ప్రజలకు పలు క్రిస్టియన్ సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. స్థానిక పాతరామాలయం చర్చి పాస్టర్, బీబీసీ సేవకుడు రెవ వైఎస్ ప్రదీప్, డాక్టర్ సైలస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహాయ ఫౌండేషన్, క్రిస్టియన్ మైనార్టీ యాక్టివ్ కమిటీ, క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్, కాంపేషన్ ఆఫ్ హెచ్ఐవీ సంస్థల సహకారంతో 12 మంది సభ్యులు కలసి 'గుడ్ సమరిటన్' టీమ్‌గా మణిపూర్‌లోని పలు జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి మెడికల్ కిట్స్, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మణిపూర్ నుంచి తిరిగి వచ్చిన పాస్టర్ ప్రదీప్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరపున వెళ్లి సహాయ, సహకారాలు అందించడం దేవుని కృప అని అన్నారు. దేవుని సేవకులకు సహకారాలు అందించి, మార్గదర్శకులుగా నిలిచిన సీఆర్‌పీ ఫోర్స్ ఇండియా ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ పాల్‌ప్రసాద్, రెవ రాబర్ట్‌పల్లవ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. మడికి గ్రామానికి చెందిన బీసీ నేత యనమదల నాగేశ్వరరావు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్‌గా వెత్సా సురేష్‌కుమార్, 14 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరులోని ఎస్‌జేఆర్ కల్యాణ మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఏఎంసీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పార్టీలకతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చింది.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఆర్జిత సేవగా స్వామి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కూడా కల్పించింది. సూపరింటిండెంట్ విజయ సారథి, పలువురు భక్తులు పాల్గొన్నారు.



అంతర్వేదిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మాజీ ఎంపీపీ సుబ్బిరెడ్డి మృతి

రావులపాలెం: మండల మాజీ ఎంపీపీ చిన్నం సుబ్బిరెడ్డి (79) ఆదివారం రాత్రి కన్నుమూశారు. రాత్రి పది గంటల సమయంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని రావులపాలెంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సుబ్బిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 1995లో రావులపాలెం మండల అధ్యక్షుడిగా సుబ్బిరెడ్డి ఎనలేని సేవలు అందించారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

13న యువ కబడ్డీ సిరీస్ పురుషుల జట్టు ఎంపిక

రావులపాలెం: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే యువ కబడ్డీ సిరీస్‌కి పురుషుల జట్టు ఎంపిక ప్రక్రియ ఈనెల 13వ తేదీ బుధవారం రావులపాలెం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ)లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొలుగూరి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక సీఆర్‌సీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. 13 తేదీ ఉదయం 9 గంటలకు సీఆర్‌సీలో జరిగే ఎంపికకు ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారుల బరువు 80 కేజీలు లోపు ఉండాలన్నారు. అలాగే వయసు 23 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9704063555, 9492099969 నంబర్లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్ రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చేమలూరి మణివీరకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.